ప్రత్యేక పూజలు



పూజల్లో కొలన్ హన్మంత్‌రెడ్డి

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పోచంపల్లి శంకర్‌నగర్‌లో హరిహర క్షేత్ర విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షుడు, మాజీ ఉప సర్పంచ్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండ్రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని, భక్తులు వేలాది సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ నవిత, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సూరారం సీఐగా వెంకటేశం

సుభాష్‌నగర్: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 41 మంది సీఐలను బదిలీ చేస్తూ.. శనివారం ఉత్తర్వులు జారీ కాగా సూరారం పోలీస్ స్టేషన్ సీఐ వెంకటేశ్వరరావు కేపీహెచ్‌బీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీసీఎస్‌లో పనిచేస్తున్న వెంకటేశం సూరారంకు రానున్నారు. పోలీస్‌స్టేషన్ ఏర్పడి 8 నెలలు గడవక ముందే మరో సీఐని కేటాయించారు.

ధరణి ప్రక్రియ ప్రారంభం



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహశీల్దార్ రెహమాన్‌ఖాన్

సుభాష్‌నగర్: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఇటీవల ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో కుత్బుల్లాపూర్ తహశీల్దార్ కార్యాలయంలో ధరణి ప్రక్రియను ప్రారంభించారు. తహశీల్దార్ అబ్దుల్ రహమాన్‌ఖాన్ శనివారం అధికారులతో సమావేశమై ధరణిపై పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో 284 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి రెండు టీమ్‌లను కేటాయించడం జరిగిందన్నారు. తొందర్లోనే వాటిని పరిష్కరిస్తామని, ఏవైనా సందేహాలు ఉంటే దరఖాస్తుదారులకు నేరుగా ఫోన్ చేసి కనుక్కుంటామని తెలిపారు.

వినతిపత్రం అందజేత

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధి సత్యం వ్యాలీ, కేకేఎం కాలనీలో మౌలిక వసతులను మెరుగుపర్చాలని కోరుతూ.. శనివారం మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావుకు కో– ఆప్షన్ సభ్యురాలు చంద్రగిరి జ్యోతి వినతిపత్రం అందజేశారు. సత్యం వ్యాలీ, కేకేఎం కాలనీలో శాసన సభ ఎన్నికల సమయంలో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కాలనీలోని రోడ్లు గతుకులమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని దీనిపై దృష్టి సారించి రోడ్ల ప్యాచ్‌వర్క్స్ చేయడంతో పాటు ఓపెన్‌జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

సురక్షిత నీటి సరఫరాకు కృషి



జలమండలి డీజీఎం చిట్టిబాబును కలిసి ఆల్విన్ ఉద్యోగులు

నిజాంపేట్: ప్రజలకు సురక్షితమైన నీటి సరఫరా చేసేందుకు కట్టుబడి ఉన్నామని నిజాంపేట్ వాటర్ వర్క్స్ డీజీఎం చిట్టిబాబు అన్నారు. శనివారం ప్రగతినగర్‌కు చెందిన ఆల్విన్ ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాటర్ పైపులైన్లు, గేట్‌వాల్వ్‌ల లీకేజీలు, లోప్రెషర్, అధిక బిల్లులు తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో డొమాస్టిక్ భవనాలకు సైతం కమర్షియల్ బిల్లులు వేస్తున్నారని, 'ట్యూషన్, భరతనాట్యం నేర్పబడును' లాంటి బోర్డులు కనబడితే కమర్షియల్‌గా మారుస్తున్నారని ఆరోపించారు. మిథిలానగర్‌లో సరఫరా చేస్తున్న ఉచిత నీటిసరఫరా గురించి అడగగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని డీజీఎం హామీ ఇచ్చారన్నారు.

వీజేఐఎంలో 'మిలన్–24'




ఫ్లాష్‌మాబ్‌లో పాల్గొన్న విద్యార్థులు

నిజాంపేట్: బాచుపల్లి విజ్ఞాన్‌జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (వీజేఐఎం)లో 'మిలన్–24' పేరుతో క్రీడలు, బిజినెస్ ప్లాన్, సాంస్కృతిక కార్యక్రమాలను మూడ్రోజుల పాటు ఘనంగా జరిగాయి. బిజినెస్‌ప్లాన్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో 13 కళాశాలల జట్లు పాల్గొనగా.. భవన్స్ వివేకానంద కళాశాలకు చెందిన ప్రసాద్ విలాస్, యష్‌బోహరా ప్రీతిక్, సమితశర్మల టీమ్ విజేతగా నిలిచి రూ.20 వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో శివశివానీ మేనేజ్‌మెంట్ కళాశాలకు చెందిన హర్షిత్, పర్మార్‌సింగ్ జట్టు నిలిచి రూ.10 వేల నగదు పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు. 30 కళాశాలలకు చెందిన 700 మంది క్రీడాకారులు బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, త్రోబాల్, బాడ్మింటన్, క్రికెట్‌లో తలపడ్డారు. చివరి రోజు శనివారం క్రిసాలిస్ పేరుతో నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్‌లో పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొని సంగీతం, డాన్స్, ర్యాంప్‌వాక్, ఫ్లాష్‌మాబ్‌లో సందడి చేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రవినాథ్ బహుమతులు అందజేశారు. కో– ఆర్డినేటర్ శ్రీనివాస్, హరిప్రియ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

● వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం ● వందశాతం పంపిణీ లక్ష్యంగా..



దుండిగల్: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా ఇప్పటికే వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి పోలియో చుక్కలు వేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

- నియోజకవర్గంలో 0–5 సంవత్సరాలలోపు పిల్లలు మొత్తం 73,314 ఉండగా.. సర్కిల్‌లో 40,241, మున్సిపాలిటీల్లో 33,073 ఉన్నారు.
- సర్కిల్‌లో 77,308, మున్సిపాలిటీల్లో 59,480 గృహాలు ఉన్నాయి.
- దుండిగల్‌లో 18, కొంపల్లిలో 7, నిజాంపేటలో 12, సర్కిల్‌లో 70 మొత్తం 107 బూత్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం 10 రూట్ సూపర్‌వైజర్లను నియమించారు. హైరిస్క్ పిల్లలు 875 మంది ఉన్నట్లు గుర్తించారు.
- ఇప్పటికే 4,400 పల్స్ పోలియో వాయిల్స్‌ను అందుబాటులో ఉంచారు.
- మొత్తం 107 బూత్‌లో ఒక్కో బూత్‌కు ఇద్దరు సిబ్బంది చొప్పున పని చేస్తారు. పిల్లల పేర్లు నమోదు చేసుకోవడంతో పాటు వారికి సిరా గుర్తు వేసేందుకు ఒకరు, పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు మరొకరు ఉంటారు. 214 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఏఎంఎన్‌లు, ఆశా వర్కర్లు, ఇతర వాలంటీర్లు విధులు నిర్వహించనున్నారు.
- ఆదివారం ఏర్పాటు చేసిన ఆయా బూత్‌ల వద్ద పోలియో చుక్కలు వేసిన అనంతరం సోమ, మంగళ వారాల్లో ఇతర ప్రాంతాల్లో సిబ్బంది పర్యటిస్తారు. దుండిగల్, పోచంపల్లి, గాగిల్లాపూర్ ప్రాంతాల్లోని ఇటుక బట్టీలు, కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం, సుభాష్‌నగర్ ప్రాంతాల్లోని గుడిసెల వద్దకు మొబైల్ టీమ్‌లు స్వయంగా వెళ్లి పల్స్ పోలియో చుక్కలు వేస్తారు.

గాజుల రామారం, కుత్బుల్లాపూర్‌లో..

కుత్బుల్లాపూర్: నేడు జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సర్కిల్, వైద్య అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలోని వార్డు కార్యాలయాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. 0–5 ఏళ్ల పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాల్సిందిగా అధికారులు కోరుతున్నారు.

తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలి..

పోలియో రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలి. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలకు తప్పని సరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి. ఇప్పటికే ఇంటింటికి తిరిగి చిన్నారుల వివరాలను సేకరించాం. అంగన్‌వాడీ టీచర్లు, ఏఎంఎన్‌లు, ఆశవర్కర్లకు అవగాహన కల్పించాం. చిన్నారులకు సరిపడా వాయిల్స్‌ను అందుబాటులో ఉంచాం. వందశాతం చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేస్తాం.

– డాక్టర్ వై.నిర్మల, మండల వైద్యాధికారిణి

విద్యార్థుల మధ్య ఘర్షణ

● పలువురికి గాయాలు
● న్యాయం చేయాలని బాధితుల విజ్ఞప్తి

కుత్బుల్లాపూర్: పాఠశాల విద్యార్థుల మధ్య తలెత్తిన ఘర్షణలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు.. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో శనివారం బ్రేక్ సమయంలో ఉదయం 8 గంటలకు పదో తరగతికి చెందిన కొందరు విద్యార్థులు, 9వ తరగతికి చెందిన విద్యార్థి ఒకేచోట చేరి మాట్లాడుకుంటుండగా.. వారిని పదోతరగతికి చెందిన ఏడుగురు విద్యార్థులు విరిగిన బెంచీల రాడ్లను తీసుకుని తీవ్రంగా కొట్టారు. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థుల తలకు తీవ్ర గాయాలు కాగా.. సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు కుట్లు వేసి పంపించారు. గొడవ జరిగిన విషయం గాయపడిన విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో పాఠశాలకు చేరుకుని అనంతరం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఇది పాఠశాలకు చెందిన సున్నితమైన అంశమని, కేసులు పెడితే విద్యార్థుల జీవితాలు నాశనమవుతాయని, పాఠశాలలోనే చర్చించుకుని పరిష్కరించుకోవాల్సిందిగా పోలీసులు సూచించినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. పాఠశాల వద్దే గాయపడిన విద్యార్థుల తల్లిదండ్రులు యాజమాన్యంతో మాట్లాడేందుకు సాయంత్రం వరకు వేచి చూశారు. ఈ దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని తమను న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



సాంప్రదాయ వేడుకల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఉత్సాహంగా సాంప్రదాయ దినోత్సవ వేడుకలు

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సాంప్రదాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగవల్లులు, బతుకమ్మ, బోనాలు, తదితర భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా పలు కార్యక్రమాలు రూపొందించి ఆహుతులను అలరించారు. కళాశాల కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాలలో విద్యార్థులకు అధునాతన సాంకేతిక విద్యను అందించడంతో పాటు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, కోశాధికారి మర్రి మమతరెడ్డి, డైరెక్టర్ శ్రేయరెడ్డి, డీన్ డాక్టర్ రాధికదేవి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో మేధో సంపత్తి మెరుగు

జగద్గిరిగుట్ట: విద్యార్థుల మేధో సంపత్తికి పాఠశాలలో ఏర్పాటు చేసే విద్యావైజ్ఞానిక ప్రదర్శనలే నిదర్శనాలని కుత్బుల్లాపూర్ మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలోని సంస్కృతి పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు ఎంతో చక్కగా రూపొందించిన మోడల్స్‌ను ఆయన అభినందించారు. చిన్నప్పటినుంచే శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కల్పించే దిశగా పాఠశాలలు కృషి చేయడం సంతోషకరమన్నారు. ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, వైష్ణవి గ్రూప్ పాఠశాలల చైర్మన్ నర్సింహులుగౌడ్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు నరేందర్, వినోద్, సంస్కృతి పాఠశాల ప్రిన్సిపాల్ బాలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నమూనాలను తిలకిస్తున్న ఎంఈఓ ఆంజనేయులు

బీసీల అభ్యున్నతికి కృషి



సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి కృషి చేస్తోందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్‌లోని నాయి బ్రాహ్మణుల ఆత్మగౌరవ భవనాన్ని పరిశీలించేందుకు వచ్చిన కుమారస్వామికి నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేసి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కులగణన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని కొనియాడారు. జాతీయ బీసీదళ్ సలహాదారుడు వెంకటరమణ, గ్రేటర్ యూత్ ఉపాధ్యక్షుడు మహేష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ ,ప్రధాన కార్యదర్శి రవి, తులసీరామ్, యాదగిరి అశోక్, మల్లేష్, స్వామి, రవి, నాగరాజ్, ప్రభాకర్, రమణ మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యానిమేషన్ ప్రోగ్రామింగ్‌లో అద్భుత అవకాశాలు

నిజాంపేట్: నేడు 3డి మోడలింగ్, యానిమేషన్, ప్రోగామింగ్‌లలో ఎన్నో అవకాశాలున్నాయని బి.ఐ.జీ గేమ్స్ వ్యవస్థాపకుడు సుధీర్ అన్నారు. శనివారం బాచుపల్లిలోని బీవీఆర్‌ఐటీ కళాశాలలో 'సెవెన్‌స్టోన్స్' గేమ్ అండ్ యూనిటీ 3డీ గేమ్ డెవలప్‌మెంట్ క్లబ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎన్ సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ.. యూనిట్ 3డీ గేమ్ డెవలప్‌మెంట్ క్లబ్, యూనిటీ 3డీ గేమ్స్ కోర్సులు బీటెక్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల కోసం ప్రారంభించామని, ఇందులో యానిమేషన్, 3డీ మోడలింగ్‌లలో మెలకువలను నేర్పిస్తామన్నారు.



ప్రారంభించిన బీఐజీ గేమ్స్ వ్యవస్థాపకుడు సుధీర్ తదితరులు

జనరేటర్ బ్యాటరీలను దొంగిలిస్తున్న ముఠా అరెస్ట్

రూ.2.64 లక్షల విలువైన బ్యాటరీ, పరికరాల స్వాధీనం



జనరేటర్ బ్యాటరీలతో పోలీసుల అదుపులో నిందితులు

నిజాంపేట్: అపార్ట్‌మెంట్లలోని చొరబడి జనరేటర్ బ్యాటరీలను దొంగిలిస్తున్న ముఠా సభ్యులను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి వారినుంచి రూ.2.64 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డెలివరీ బాయ్‌గా పనిచేసే మియాపూర్ మాతృశ్రీనగర్‌లో మేడిశెట్టి నాగేశ్వరరావు(20), పులిదండి నాగశ్రీను(19), మియాపూర్ మాధవ్‌నగర్ కాలనీకి చెందిన డ్రైవర్ వాసంశెట్టి వెంకటేశులు (20), డ్రైవర్‌గా పనిచేస్తున్న మణికొండలోని క్లాసిక్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్ కుమారుడు బత్తుల దుర్గాప్రసాద్(20), మియాపూర్ బాలాజీనగర్‌కు చెందిన కారు డ్రైవర్ గుడ్ల గురుమూర్తి (21) వీళ్లందరూ స్నేహితులు. కాగా జల్సాలకు అలవాటు పడిన వీరు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో అపార్ట్‌మెంట్లలో జనరేటర్ బ్యాటరీలను తస్కరించేందుకు పథకం పన్నారు. ఈ క్రమంలో పలు అపార్ట్‌మెంట్ల సెల్లార్లలో ఉన్న జనరేటర్ బ్యాటరీలను దొంగిలించి, వాటిని విక్రయించగా.. వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తూ వస్తున్నారు. ఈ తరహాలో నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడగా.. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు డీఎస్సై చంద్రశేఖర్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి శనివారం వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి స్విఫ్ట్ డిజైర్ కారు, 64 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పేట్‌బషీరాబాద్ సీఐగా విజయవర్ధన్

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ సీఐగా విజయవర్ధన్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న జి.ప్రశాంత్ రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మాదాపూర్ జోన్ ఎస్‌ఓటీ సీఐగా పనిచేస్తున్న విజయవర్ధన్ బదిలీపై పేట్‌బషీరాబాద్ సీఐగా వచ్చారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణసూరి తెలిపారు. ఈనెల 7న సాయంత్రం 5 గంటలకు గణపతి పూజ, రుద్ర హోమం, 8న తెల్లవారుజామున 4.30 నుంచి కాశీ విశ్వేశ్వర స్వామికి భక్తులచే సామూహిక సంతధార అభిషేకాలు, రుద్రహోమం, అర్చనలు, రాత్రి 9.30 గంటలకు కాశీ విశాలాక్షి విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం, అనంతరం మాన్యాశ పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 9న నిత్యాభిషేకం, రుద్రహోమం పూజా కార్యాక్రమాలు ఉంటాయని, శివరాత్రి రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రెండింతల ఇంటిపన్నును ఉపసంహరించుకోవాలని ధర్నా

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రెండింతలు చేసిన ఇంటి పన్నును తక్షణమే ఉపసంహరించుకోవాలని, ప్రజలపై హేతుబద్ధంగా పన్ను విధానాన్ని అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా.ఎస్.మల్లారెడ్డి అన్నారు. శనివారం ఉదయం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పన్నులు తగ్గించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్లారెడ్డి మాట్లాడుతూ.. పన్నుల రూపంలో వసూలు చేసిన ప్రతి పైసా ప్రజా అవసరాలకే వినియోగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో పార్కులు, ప్రభుత్వ భూములు కబ్జాలకు గురౌతున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ మాట్లాడుతూ.. పెంచిన పన్నును తగ్గిస్తామని గతేడాది హామీ ఇచ్చిన కమిషనర్ ఇప్పటి వరకు పన్నులు తగ్గించలేదన్నారు. 2022–23 సంవత్సరానికి ఆస్తి పన్ను 3,4,5 అంతస్తుల ప్లాట్స్‌కు రెండింతలు పెంచేసి 2022 సంవత్సరం నుంచి ప్రజల దగ్గర నుంచి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. నిజాంపేట్‌ను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క రూపాయి స్పెషల్ గ్రాంట్ గత ప్రభుత్వం కేటాయించలేదన్నారు. రాష్ట్రంలోని మిగతా మున్సిపాలిటీల్లో ఇలాంటి సమస్య రాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నాయకులను కార్యాలయం లోపలికి అనుమతించకపోవడంతో ధర్నా అనంతరం కార్యాలయం గేట్‌కు వినతి పత్రం కట్టారు. నిజాంపేట్ అధ్యక్షుడు ఆకుల సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా మహిళ ప్రముఖ్ అమలేశ్వరీ, దాసి నాగరాజు, బిక్షపతి యాదవ్, సత్యనారయణ, అరుణ్‌రావు, ఈశ్వర్‌రెడ్డి, ముఖేష్ గౌడ్, జగదీష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

గేట్‌కు వినతిపత్రం కడుతున్న దృశ్యం



అభివృద్ధి పనులు ప్రారంభం

● నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతం చేస్తాం.. ● 2వ వార్డులో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం ప్రగతినగర్‌లోని 2వ వార్డులో సుమారు 2 కోట్లతో అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు. 2వ వార్డులోని రూ.99 లక్షల నిధులతో విజయదుర్గ కాలనీ జీపీఆర్ లేఅవుట్‌లో సీసీరోడ్డు, రూ. 62 లక్షలతో మంజీర వాటర్ పైపులైన్, రూ.18 లక్షలతో సింహపురి కాలనీలో సీసీరోడ్డు, రూ.47 లక్షలతో రుద్ర కుటీర్ నుంచి లోహిత అపార్టుమెంట్ వెనుకల వరకు సీసీరోడ్డు, రూ.26 లక్షలతో కాంపౌండ్ వాల్ లాంటి అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. 2వ వార్డులో అభివృద్ధి పనుల కోసం నిరంతరంగా కృషి చేస్తున్న కార్పొరేటర్ చిట్ల దివాకర్‌ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కమిషనర్ రామక్రిష్ణరావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు కొలను గోపాల్‌రెడ్డి, మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి శంకుస్థాపన..

14 వార్డులో గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కాలేజీ రోడ్డులో నూతనంగా నిర్మించనున్న మున్సిపల్ కార్యాలయానికి శనివారం ఎమ్మెల్యే వివేకానంద శంకుస్థాపన చేశారు.

బ్రహ్మోత్సవాల్లో ...

జర్నలిస్టు కాలనీ సమీపంలోని వేంకటేశ్వర, సీతారామ లక్ష్మణ సహిత పలు ఆలయాల్లో కాలనీవాసుల ఆధ్వర్యంలో ప్రథమ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు వివేకానంద, మనోహర్‌రెడ్డి, మేయర్ కొలను నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. 30వ వార్డు కార్పొరేటర్ కొలను మీన సునీల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, అస్కాని మారుతిసాగర్, బాలక్రిష్ణ, సంక్షేమ సంఘం నాయకులు ప్రవీణ్ సురిశెట్టి, వెంకటేశ్వర్‌రావు, సురేందర్, శివ, జక్కుల శ్రీనివాస్, వెంకట్, రమ, టేకుల నరసింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.